కథ


# ఏది పడితే అది!

వార్ణంది వెంకట రామశర్మ

"ఒక వంతెన మీదినుంచి ఏభై గొర్రెలు వెళ్తున్నాయి. ఇంతలో ఉన్నట్టుండి ఎనిమిది గొర్రెలు వంతెన మీద నుంచి ఊళ్లలోకి దూకేసాయి! ఇంకా వంతెన మీద ఎన్ని గొర్రెలుంటాయిరా?" అనడిగాడు క్లాసులోని పిల్లాడిని టీచరు.

"ఒక్కటి కూడా ఉండదు సార్!" అన్నాడా పిల్లాడు.

"ఏరా! పొగరుగా ఉందా? ఏభైలోంచి ఎనిమిది పోతే, నలుభైరెండు గొర్రెలుంటాయి కదా!" అన్నాడు టీచరు కళ్లెర్రజేసి. "అవి లెక్కల్లోనే సార్!" అసలే అవి గొర్రెలు. ముందు గొర్రె ఏం చేస్తే వెనకాలదీ అదే చేస్తుంది! అంచేత మిగతా నలభైరెండూ కూడా నీళ్లలోకి దూకేస్తాయి! అక్కడేం మిగలవు!" అని జీవిత సత్యాన్ని చెప్పాడా కుర్రాడు. "-ఎవరు సృష్టించారో గానీ, ఇది చాలా ప్రాచుర్యం పొందిన గొప్ప జోక్!" అన్నాడు రాజు అనబడే రాజేశ్వరరావు.



''దూరదర్శన్‌లో వస్తున్న కార్యక్రమం హఠాత్తుగా ఆపి, 'ఇప్పుడొక బృందగానం'అని ప్రసారం చేసినట్లు ఇప్పుడీ పీకుడెందుకు పీతాంబరం!''అన్నాడు మూర్తి ఏవీఆర్.

ఏవిఆర్ మూర్తి అన్నది ఆయన పేరు. 'ఏవీ రాని మూర్తి'అని ఆట పట్టిస్తున్నారని, మూర్తి ఏవీఆర్ అని కూర్చుకున్నాడు. రాజేశ్వర రావుకి చిన్ననాటి స్నేహితుడు. అందుకే చనువుగా ప్రాస కోసం స్నేహితుడిని పేర్లు మార్చి మార్చి పిలుస్తూండడం అలవాటు మూర్తికి. ఇద్దరూ వేరు వేరు సంస్థల్లో ఉద్యోగస్తులు కావడం వలన, అప్పుడప్పుడు ఎవరో ఒకరి ఇంట్లో కలుస్తూంటారు'' ఆరోజు అలానే రాజు ఇంట్లో కూర్చున్నారు!

అందుకే 'పీతాంబరం' అని మూర్తి తనని పిల్చినా పట్టించుకోకుండా, ''ఎందుకా! అదిగో! అలాచూడు!''అని టీవీలోని ప్రోగ్రాం చూపించాడు.

''పాడుకో! పాడుకో!''ప్రోగ్రాం కదా అది. చాన్నాళ్లై వస్తోంది! ఎప్పుడూ చూళ్లేదా? వరద ప్రాంతాల్లో బాగా ఎండలు కాసాక పర్యటించి, అసలు ఇక్కడ వరదలు ఏవీ? అనడిగిన మంత్రిగార్ని వెర్రిమొహం వేసుకుని చూసిన ఆ ప్రాంతపు ఎమ్మార్వోలా మొహం పెట్టి రాజుని అడిగాడు మూర్తి ఏవీఆర్.

'చూసాన్లే! ఇక్కడ చూడు!' ఇంకో ఛానల్ మార్చాడు రాజు.

'పాటల పల్లకీ'ప్రోగ్రాం అది' అన్నాడు మూర్తి. క్విజ్ పోటీలో ఠక్కున బజ్జర్ నొక్కిన వాడిలా!

'ఓకే మరి! ఇది?'ఇంకో ఛానెల్‌లోకి మారాడు రాజేశ్వరరావు.


'నేనొక్కణ్ణే!' పాటల ప్రోగ్రాం అది! అయినా నువ్విలా ఛానెల్స్ మార్చి మార్చి నామీద ప్రశ్నలు గుప్పించి, నా ఐక్యూ తరిగేలా, బీపీ పెంచక్కరలేదు! ఇవి కాక, 'వాయిస్ ఆఫ్ ఏపీ', 'ఆంధ్రా వాయిస్', 'సూపర్ వాయిస్'... ఇలాంటి ఇంగ్లీషు పేర్లు గల తెలుగు పాటల కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఇంతకీ ఇప్పుడీ రీసెర్చి దేనికి రంగనాథా! అనడిగాడు మూర్తి ప్రత్యేక తెలంగాణా వస్తుందా రాదా! అన్నంత అయోమయంగా!

చెప్తానాగు! అని అక్కడున్న పేపరు తీసి, 'టీవీలో కార్యక్రమాలు' అన్న శీర్షిక తీసి, ఓ చోట పెన్‌తో అండర్ లైన్ చేసి. 'ఇదేంటీ?'అనడిగాడు రాజు, అక్షరాలు గుర్తుపట్టమన్న కళ్ల డాక్టర్లా!

''నా కళ్లజోడీమధ్యే మార్చా! నువ్వు మళ్లీ టెస్ట్ చేయ్యక్కర్లా! ఇది 'డాన్స్ డాన్స్'ప్రోగ్రాం!''అన్నాడు మూర్తి.

''ఇంకా ఇలాంటివి ఎన్ను న్నాయంటావ్?''

''ఉన్నాయి చాలానే! ఆట, వేట, డాన్స్ చేసి చూపిస్తా!.. ఇలా! అయినా, నీకెందుకురా ఇవన్నీ?!... ఓహో! నాకిప్పుడర్థమైంది.!



ఒక ఛానెల్‌వాడు ఏదో ఒక ప్రోగ్రాం మొదలెట్టాడని, ఇంక అందరూ అలాంటివే మొదలు పెడుతారు! ఇందాకటి గొర్రెల జోక్‌లా! అంతేనా!''చిదంబర రహస్యం (అంటే! ఆర్థిక మంత్రి చిదంబరంగారి బడ్జెట్ ఎలా ఉంటుందో కనిపెట్టడం!)కనుగొన్న వాడిలా అన్నాడు మూర్తి.

''సరిగ్గా అంతే అనుకో! గతంలో ఆడ విలన్ల కార్పోరేట్ (ఇంకా ఇప్పుడూ ఉన్నాయనుకో!) సీరియల్స్‌తో ప్రాణం తీసారు అన్ని టీవీల వాళ్లు. ఇప్పుడివి?''అన్నాడు రాజేశ్వరరావు కుర్చీలో వెనక్కి వాలి ఒళ్లు విరుచుకుంటూ.

''అయితే ఏం పోయింది? ఆ పిచ్చి సీరియల్స్ చూసి బీపీ పెంచుకునే కన్నా, ఇవి నయ్యమే కదా! చెవులకింపైన పాటలు, కంటికింపుగా డాన్సులు, నీకు చూడ్డం ఇష్టం లేకపోతే టీవీ ఆపేయొచ్చుగా! ప్రతిదానికి అదేదో టీవీ99 వాళ్లలాగా ఈ రంధ్రాన్వేషణ దేనికీ!?''రాజు పైన విరుచుకు పడ్డాడు బీచ్‌లోని కెరటంలా!

మూర్తి విమర్శని లెక్క చేయకుండా, నింపాదిగా కుర్చీలోంచి ముందుకు వంగి, టీపాయ్ మీదున్న సెల్‌ఫోన్‌ని చేతిలోనికి తీసుకుంటూ, ''టీవీ ఆపేయొచ్చు కానీ యీ ఎస్ఎమ్ఎస్‌లని ఆపలేను కదా! నెలకి అయిదొందలదాకా వదిలిపోతోంది నాకు!''అన్నాడు రాజు.

''మధ్యలో నీకెందుకు వదులుతుందిరా వరదరాజా! రాష్ట్రంలో ఎరువుల కొరతకి గత ప్రభుత్వమే కారణమని ఇప్పటి ప్రభుత్వం అన్నట్టుంది నువ్వు చెప్పింది.''

''కరెక్టు! ఆ ఎరువుల లాజిక్‌లో సదరు మంత్రి గారు వివరణ ఇచ్చాడు చూడు! అలానే ఆ టీవీ కార్యక్రమాలకి, నా ఎస్ఎమ్ఎస్‌లకీ లింక్ ఉంది! టీవీల్లో పాడేవాళ్లు, ఆడేవాళ్ల చుట్టాలు, స్నేహితులు వాళ్లకి కనబడ్డ ప్రతి పరిచయస్తుడికీ మావాడు ఉన్నాడనో, మా పాప ఉందనో చెప్పి ఎస్ఎమ్ఎస్‌లు ఇమ్మని రిక్వెస్ట్‌లు. మా ఆఫీసులో కొంత మందైతే అప్పటికప్పుడు ఎస్ఎమ్ఎస్‌లు ఇస్తేగాని వదలడం లేదు.''

''పోన్లేరా! ఏదో పిల్లలు! వాళ్లని ప్రోత్సహించొచ్చుగా! వాళ్ల పాటల వల్ల మేలేగాని కీడు జరగడం లేదుకదా! అయినా నేనూ ఇస్తున్నాగా ఎస్ఎమ్ఎస్‌లు!''అన్నాడు మూర్తి.

''నువ్వు ఇవ్వకేం చేస్తావురా! నీది కంపెనీ సెల్! బిల్ బాధలేదు. నీ కంపెనీయే కడుతుంది! మంత్రి గారు ప్రభుత్వం ఖర్చుతో విదేశాలకి వెళ్లొచ్చినట్టు!''

''సర్లే! నా సెల్ మీద ఎందుకు నీ కన్ను! కావాలంటే, నా సెల్ నుంచి నువ్వూ ఓ నాలుగు ఎస్ఎమ్ఎస్‌లు ఇచ్చుకో! ఇంతకీ ఎస్ఎమ్ఎస్‌లు ఇస్తే ఏం పోయిందిటా! మంచిదేగా! ఎవరో ఒకరు సెలెక్టవుతారు కదా!''

''అవుతార్లే ఎవరో ఒకరు! కాని బలవంతపు ఎస్ఎమ్ఎస్‌ల వలన అసలైన వాళ్లు సెలక్ట కాకుండా పోతున్నారు. పైగా వాళ్లకి ఎంత టెన్షన్! ఓడిపోయిన వాళ్లు అక్కడే బోరుమని ఏడవడం... అదంతా మనకి క్లోజప్‌లో, రకరకాల ఏంగిల్స్‌లో చూడడం! ఇదంతా అవసరమా! పైగా వాళ్లలో వాళ్లకె పోటీలాగా, అన్ని ఛానెల్స్ వాళ్లూ ఒకే సమయంలో పాటలో, ఆటలో ప్రసారం చెయ్యడం! ఏవరం ఏదీ సరిగా చూసి ఆనందించలేం! ఇంత చిన్న విషయం వాళ్లకెందుకు తెలీదో!''అన్నాడు రాజు.

''వాళ్ల ఛానెల్స్! వాళ్లిష్టం!! మధ్యలో నీ గోలేంట్రా గోవిందా?''

''అది కాదురా! ఆ పిల్లల యాతన, ఆ తల్లిదండ్రుల యాతన ఎలాంటిదో నీకు తెలీదు! మొన్నామధ్య మా కొలీగ్‌కి దగ్గర బంధువట! ఓ అబ్బాయి మా ఆఫీసుకి వచ్చాడు. పాటల పోటీలో సెమీస్‌కి వచ్చాట్ట! తనకి ఎస్ఎమ్ఎస్ చేసి ఫైనల్స్‌కి పంపమని ప్రింటెడ్ కార్డ్స్ తెచ్చి అందరికీ పంచాడు. ఇలానే ఊరూరా తిరిగి, వీలయినంత మందిని కల్సి ఇలా అడుగుతున్నాట్ట! మరి చదువో? అని అడిగాను. ఇంజనీరింగ్ చేస్తున్నాట్ట. ఎలాగోలా టైం సర్దుబాటు చేసుకుని చదువుతున్నానంకుల్ అన్నాడు. పోనీ ఎంత ఖర్చు చేస్తున్నావు వీటన్నిటికీ? అనడిగా మా డాడీ చూస్కుంటున్నారంకుల్ ఇవన్నీ అని అక్కడి నుంచి పారిపోయాడు, ఇంకా ఏం అడుగుతానోనని! ఇంకా ఇలాంటి వాళ్లెందరున్నారో కదా అనిపించింది. ఎలక్షన్లలో ఇంటింటికి తిరిగే అభ్యర్థులకీ, వీళ్లకీ తేడా నాకట్టే ఏం కనబడలేదు.''అన్నాడు రాజు ఒకింత సీరియస్‌గా!

''పోన్లేరా! ఆ పిల్లాడు ఫైనల్స్‌లో సెలెక్టయి, ఆ తర్వాత సిన్మాలో పాడతాడేమో? విందువుగాని. తేలిగ్గా తీసుకో దీన్ని. ఇది అత్యంత గొప్ప అనవసర విషయం.''అన్నాడు మూర్తి తత్వబోధ చేసేవాడిలా!

''ఏం వింటాం లేరా! ఇక్కడ టీవీలో పోటీల కోసమని చక్కని చక్కని పాత పాటలు బ్రహ్మాండంగా పాడతారు. ఇంక సిన్మాల్లోకి వెళ్లాక ''ఇచ్చుకో! పుచ్చుకో! గిచ్చుకో, గిల్లుకో''అంటూ వెర్రి పాటలు హోరుమనే సంగీతపు గోలలో పాడతారు. ఆ పిల్లాడు మళ్లీ వచ్చి 'అంకుల్! ఇది నేను పాడిన పాటే' అని చెప్తే తప్ప తెలీదు... సరిగ్గా ఇలాగే ఇంకో కుర్రాడు, ఆట-వేట ప్రోగ్రాంలో ఫస్టొచ్చి, ఏదో సిన్మాలో చాన్సిచ్చార్ట పాపం ఆ కుర్రాడు ఆ సినిమా టిక్కెట్లు ఓ పాతిక కొనుక్కొచ్చి మా ఆఫీసులో అందరికీ పంచి 'అంకుల్! ఈ సిన్మాలో నా డాన్స్ చూడండి' అని రిక్వెస్ట్ చేశాడు! తీరా చూస్తే, కౌరవుల్లో నూరోవాడి వేశంలా, ఆ కుర్రాడు హీరో వెనకాల గెంతిన నలభైమందిలో ఒకడిగా ఓ క్షణం కన్పించి మాయమయ్యాడు.''

''నువ్వు చెప్పిందంతా బానే ఉందిరా! కానీ మనం ఏం చేయగలం చెప్పు? నీకిష్టమైతే టీవీ చూడు లేపోతే ఆపెయ్! అంతే! ఇదిలా కొన్నాళ్లుంటుంది. అయినా చక్కగా పిల్లలూ, పెద్దలూ పాడుతూంటే, ఆడుతూంటే చూసి ఆనందించకుండా నువ్వెందుకు మధ్యలో బాధపడిపోతున్నావు? ఇప్పుడొస్తున్న న్యూస్ ఛానెళ్ల వాళ్లలాగా ప్రతీదాన్నీ నెగిటివ్‌గా ప్రజెంట్ చెయ్యకు! మంచిది కాదు!''అన్నాడు మూర్తి మళ్లీ ఒకింత సీరియస్‌గా.

మళ్లీ ఏదో గుర్తొచ్చినవాడిలా మొదలెట్టాడు!

''ఇలాంటి కార్యక్రమాలు ఏవైనాగానీ కొన్నా(న్నే)ళ్లుంటాయి! తర్వాత ఇంకోరకంవి ఏవో వస్తాయి. ఏదైనా ఓ కొత్త ఆచరణో, సంఘటనో మొదలైందని అనుకో, ఇంక అదే దారి పడతారందరూ! ఫ్యాషన్లయినా, సిన్మాలయినా, టీవీ కార్యక్రమాలైనా ఇంతే!

'సిన్మాలు చూడు! అప్పటి దాకా ఉన్న హీరో, హీరోయిన్ల డిమాండ్ హఠత్తుగా పడిపోయి, యంగ్ హీరో, హీరోయిన్ల తరం మొదలైంది. సిన్మావాళ్ల పిల్లలందరూ హీరోలైపోయారు! సిన్మా టైటిల్స్ చూడు! ప్రతిదానికీ చివర ఓ టాగ్‌లైన్ ఫ్యాషన్! 'ఇడియట్!–ఓ చంటాడి ప్రేమకథ'లా.

రేడియోలు!!..ఎఫ్ఎమ్ సిస్టం వచ్చి. మళ్లీ అయిదారు రేడియో స్టేషన్లు వచ్చి 24 గంటలూ ఊదరగొట్టేస్తున్నాయి. 'సాఫ్ట్‌వేర్' వెర్రి పట్టుకుని, ఓ పదేళ్ల నుంచి అందరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకే ఎగబడిపోతున్నారు.

టీవీల్లో ప్రకటనలు చూడు! ఎక్కడో ఎవడో ఓ ఛానెల్‌వాడు మొదలెట్టాడు కిందన న్యూస్ స్క్రోలింగ్! ఇంక ప్రతి టీవీది అదేదారి! ఆ వెర్రి ముదిరి, నాలుగేసి లైన్లు కిందన, పైనొక లైను చొప్పున ఇంక అదే పని! అసలు బొమ్మ కనబడనివ్వకుండా! అలాంటిదే ఈ పాటల, ఆటల గోల కూడా! పాటలు వరదలాగా, ఆటలు పోటుల్లాగా మనల్ని ముంచెత్తుతున్నాయి.

అసలిలాంటివి టీవీ, సిన్మాల్లోనే కాదు! జీవితంలో కూడా అలానే వరసగా జరుగుతూంటాయి.'' వింటున్నావా లేదా! అన్నట్లు ఆగాడు మూర్తి! వింటున్నాలే చెప్పు! అన్నట్టు చూశాడు రాజు.

''మొన్నా మధ్యన గౌతమి ఎక్స్‌ప్రెస్ బోగీలకి మంటలంటుకుని కాలి పోయాయి. ఆ తర్వాత పద్మావతీ ఎక్స్‌ప్రెస్‌కి అలాంటి ప్రమాదమే జరిగింది. మధ్య మధ్యలో ఇలాంటి చిన్న చిన్న మంటలేవో ఒకటి రెండు రైళ్లల్లో కూడా జరిగాయనుకో!

అంతెందుకూ! బెజవాడ కనక దుర్గ గుడిలో తొక్కిసలాట జరిగిందా? ఆ తర్వాత హిమాచల్‌ప్రదేశ్‌లో నయనాదేవి ఆలయంలో, మళ్లీ దగ్గర్లోనే, జోధ్‌పూర్ చాముండీ ఆలయంలో కూడా అలానే తొక్కిసలాట జరిగి ఎంతమంది చనిపోలేదు!?..

ఇలా ఎన్నని చెప్పాలి! అసలు ప్రకృతి కూడా 'ఏది పడితే అదే' చేస్తుంది తెల్సా!''అన్నాడు మూర్తి.

''అదేమిట్రా! మనుషుల్నొదిలి ప్రకృతి మీద పడ్డావు?''

''అవున్రా! వస్తే వరస పెట్టి తుఫాన్లొచ్చి రాష్ట్రాన్నో, సగం దేశాన్నో ముంచేయడం! లేదా! ఎండలు మండి, నీళ్లు ఎండి పవర్‌కట్‌కి దారి తీయడం! భూకంపాలో, సునామీలో దగ్గర దగ్గరగా వచ్చి నానా భీభత్సం చేయడం, ఇలా ఏది పడితే దాన్నే గొర్రెల్లా అనుసరించేస్తూండడం ప్రకృతితో సహా అంతటా ఉంది! అంచేత, ప్రతి దాని గురించి ఎక్కువ ఆలోచించకు! అసలు ఆలోచించకు!''అన్నాడు మూర్తి గీతోపదేశం చేసిన శ్రీకృష్ణుడిలా!

''బావుందిరా! నువ్వూ! నీ వింత విశ్లేషణ! అసల్నిన్ను ఏవీరాని మూర్తి అని పిలిచిందెవర్రా? ఇన్ని విషయాలు తెలుస్తేనూ నీకూ!?

''ఏవీరావని అందరూ ఏడిపిస్తేనే ఇలా చాలా విషయాలు తెల్సుకున్నా! కానీ ఏవీ రానట్టే ఉంటాను! ఓకే చివరగా ఓ ప్రశ్న! లేటెస్ట్ 'ఏది పడితే అది ' ఏమిటో చెప్పుకో చూద్దాం! క్విజ్ ప్రశ్న వేశాడు మూర్తి.

''ఒరే! నువ్వింత చెప్పాక, ఇంకా ఆలోచించడం అన్నది ఇందాకట్నుండే మానేసాగానీ! అదేంటో నువ్వే చెప్పు!''అన్నాడు రాజు.

''ఏముంది? అమెరికాలో బేంక్‌లు ఒకదాని వెంట ఒకటి 'పడి'పోవడం!! అంటూ లేచాడు మూర్తి!

*